లేమో?

నావన్నీ నిజంగా మూఢనమ్మకాలేనేమో.

ఎలాగైనా రామారావుకి సారీ చెప్పాలి.. ఇన్నాళ్ళూ వాడిని విసుక్కున్నందుకు.

ఎప్పుడూ అసహ్యించుకునే తను, ఇప్పుడు ఆ పిల్లిని ఎప్పుడెప్పుడు చూద్దామా అన్పిస్తోంది. 'ఎంత చక్కగా ఉంటుందని' మనసులోనే అనుకున్నాను.

గబగబా ఆఫీసు నుండి బయటపడి ఇంటికి చేరుకున్నాను.

యధాలాపంగా ఎదురింటి వైపు చూసాను.

రామారావు కనిపించేడు.

పలకరింపుగా నవ్వాను.

ఎందుకో వాడు తిరిగి నవ్వలేదు.

దిగులుగా ఉన్నట్టు కనిపించాడు.

''అన్నట్టు మీ కిట్టీ ఏది?'' అడిగాను. రామారావు పిల్లిని ముద్దుగా కిట్టీ అని పిలుచుకుంటాడు. దాన్ని చూడాలన్న తహతహతో అడిగాను.

రామారావు కళ్లల్లో నీళ్లు!

''ఇంకెక్కడి కిట్టీ? తెల్లవారే ఎవరి మొహం చూసిందోగాని కారు క్రిందపడి చచ్చిపోయింది...''

ఇంకేదో చెప్తూనే ఉన్నాడు.

నాకింకేమీ వినిపించడం మానేసింది.

తేలుకుట్టిన దొంగలా నెమ్మదిగా అక్కడి నుంచి జారుకున్నాను.

**-డి. సత్యారావు** (విశాఖపట్నం)

# అనుబంధం

**అన్నగారికి ఉద్యోగం పోయిందని తెలిసిన దగ్గర నుండి చెల్లెలు హేమ మొహం చాటేయడం మొదలుపెట్టింది. అంతకుముందు అన్నయ్యా వదినా అంటూ పిఠాపురం నుండి వారానికి ఒకసారైనా కాకినాడ వచ్చి అన్నావదినల దగ్గర వుండి, కావలసినవి వండించుకొని, తిని, ఇంకా తనకు కావలసిన సామాన్లు పట్టుకుపోయేది.**

హేమ, మాలిని వదినా మరదళ్ళులా కాక సొంత అక్కా చెల్లెళ్ళులా ఉంటారు. తల్లీదండ్రీలేని హేమకు అన్నగారే తల్లీ తండ్రీ అయి పెంచి, తన స్నేహితుడికిచ్చి పెళ్లి చేసాడు.

చెల్లెలు కడుపునిండా తింటే తన కడుపు నిండిపోయినట్లుండేది రఘుకు. అలాంటి చెల్లెలు తనకు ఉద్యోగం టెంపరరీగానే అయినా పోయిందని తెలియగానే రాకపోకలు తగ్గించేసింది. తగ్గించేయడమేమిటి పూర్తిగా మానేసింది.

తనకు సహాయం చేయాల్సి వస్తుందనా? చెల్లెలు ఆపదలో ఆదుకోకూడదా, ఆడపిల్ల అయినంత మాత్రాన ఎంతసేపూ మా యింటికొస్తే ఏం తెస్తారు, మీ యింటికి వస్తే ఏం పెడతారు అనే ఆలోచించాలా. కుటుంబంలోని కష్టసుఖాలు ఒక్క మగవాడికేనా, ఆడపిల్ల ఎంతసేపూ ఆస్తి దక్కించుకోవడమేనా, ప్రపంచంలో పూర్తిగా మగవాళ్ళుగానీ, పూర్తిగా ఆడవాళ్ళుగానీ ఉంటే బావుండేదేనేమో. అసలు గొడవలన్నీ పెళ్ళి చేసుకున్న దంపతుల మధ్యగానీ, అన్నాచెల్లెళ్ళ మధ్యగానీ, తల్లీకొడుకుల మధ్యగానీ యిలాగే వస్తున్నాయి కదా. బెల్లం చుట్టూ చీమల లాగా డబ్బు దగ్గరే అన్నాచెల్లెళ్ళ బంధుత్వమా? అబ్బా! ఈ ఆడవాళ్ళ మనస్తత్వంతో ఎంత తలనొప్పో. ఎప్పుడు ఎలా ఉంటారో చెప్పలేం. ఛ.ఛ. నేను యిలా ఆలోచిస్తున్నానేమిటి? చేతిలో డబ్బుల్లేక మతిస్థిమితం తప్పుతోందా? నాకు ఉద్యోగం



పోయిందన్న బాధకంటే హేమ చేసిన పనిని జీర్ణించుకోలేకపోతున్నాను అనుకున్నాడు.

మాలిని ఆలోచనలు కూడా యించుమించు అలాగే ఉన్నాయి. హేమను ఎంత ప్రేమగా చూసాను. అయినా సరే ఎలా మారిపోయిందో. చెరువులో నీళ్ళు లేకపోతే చేపలుండవుకదా! ఇప్పుడు మాకు నెల నెలా జీతం లేదు. అందుకే హేమ రావడం మానేసింది.

ఇంతలో హేమ రాసిన ఉత్తరం పోస్ట్‌లో వచ్చింది.

''అన్నయ్యా! ఇన్నాళ్ళూ నీ దగ్గరకు రావడం లేదని బాధపడుతున్నావు కదూ! నీకు త్వరలోనే ఉద్యోగం తిరిగి వస్తుందని మీ బావగారు చెప్పారు. చాలా సంతోషం అనిపించింది. మా అన్నయ్య ఏమాత్రం బాధపడినా సహించలేను నేను. నీకు ఉద్యోగం వచ్చిన తరువాత తప్పక వస్తాను. ఈలోపుగా నా గురించి నీవు ఏమి అనుకుంటున్నావో అని భయంగా ఉంది. అన్నయ్యా! ఇన్ని రోజులు నేను నీ దగ్గరకు రాకపోవడానికి కారణం ఉంది. నీవు నన్ను తప్పుగా అర్థం చేసుకోవద్దు.

ఎప్పటిలాగే నేనూ మీ బావగారూ వారం వారం వస్తుంటే మిమ్మల్ని ఇదివరకటిలా ఆదరించలేక, నీవు బాధపడతావు. మాకు ఏ లోటూ చేయలేని మనస్తత్వం వదినది. మేం వచ్చి మీకు యింకా యింకా ఖర్చులు పెంచాలి. ఆ ఖర్చులు నీ కష్టకాలంలో నీకు తగ్గించాలని మేము రావడం మానేసాము. నీకు ఉద్యోగం రానివ్వు, ఆఘమేఘాల మీద వచ్చేస్తాం. మిమ్మల్ని ఎప్పుడెప్పుడు చూస్తానా, వదిన చేతి వంట ఎప్పుడెప్పుడు తింటానా అని మనసు ఆరాటంగా ఉంది. వదినను అడిగానని చెప్పు.

ప్రేమతో,

నీ చెల్లెలు

హేమ.''

చెల్లెలి ఉత్తరం చదివిన ఆ అన్నయ్య అనుమానం పటాపంచలైపోయింది.

**-'రాధిక'** (కాకినాడ)